క్లుప్తంగా

హెల్మెట్‌తో సురక్షిత ప్రయాణం

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



హెల్మెట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

పటాన్‌చెరు టౌన్: సమాజసేవలో స్వచ్ఛంద సంస్థల పాత్ర అభినందనీయమని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. మండలంలోని ఇస్నాపూర్‌లో ఆదివారం మేరా ఇండియా సోషల్ సర్వీస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో హెల్మెట్ల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని, డెలివరీ బాయ్స్‌కి హెల్మెట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి సంవత్సరం 87శాతం మంది హెల్మెట్ ధరించకపోవడం వల్ల చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఐ వినాయక్‌రెడ్డి, ఇస్నాపూర్ మాజీ సర్పంచ్‌లు బాలమణి, వెంకట్ రెడ్డి మేరాజ్ పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న కార్పొరేటర్ సింధురెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారతినగర్ డివిజన్ పరిధిలోని మ్యాక్ సొసైటీ కాలనీలో షిర్డిసాయిబాబా ఆలయంలో ఆదివారం ఆలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సింధురెడ్డి పాల్గొన్ని ప్రత్యేక పూజలు చేశారు.

జాతీయ జెండాకు అవమానం



తలకిందులుగా జెండాను ఎగురవేసిన కార్యదర్శి నాసిరొద్దీన్

వట్‌పల్లి(అందోల్): మండలంలోని మర్వెల్లి గ్రామంలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో జాతీయ జెండాకు అవమానం జరిగింది. పంచాయతీ కార్యాలయం వద్ద జెండా ఎగురవేసే క్రమంలో కార్యదర్శి నాసిరొద్దీన్ జెండాను తలకిందులుగా ఎగురవేశారు. అక్కడున్నవారు గమనించి చెప్పడంతో వెంటనే కిందకు దింపి జెండాను సరిచేసి మరోసారి ఎగురవేశారు. జెండాను తలకిందులుగా ఎగురవేయడం కార్యదర్శి నిర్లక్ష్యానికి నిదర్శనమంటూ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు



ఉర్సులో పాల్గొన్న నరోత్తం

జహీరాబాద్: కోహీర్ మండలంలోని రాజనెల్లి గ్రామంలో నిర్వహిస్తున్న ఉర్సులో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నరోత్తం పాల్గొన్నారు. ఆదివారం హజ్రత్ మౌలానా ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ఈశ్వరప్ప పాటిల్, విఠల్, జలీల్‌పాష, జైపాల్, నవాబ్, ఫయాజ్, బాబా, అబ్దుల్ మన్నాన్, మతిన్, బుజీబ్, సర్దార్‌ఖాన్ పాల్గొన్నారు.

ముగిసిన టోర్నమెంట్



విజేతకు కప్‌ను అందజేస్తున్న హఫీజ్

ఝరాసంగం(జహీరాబాద్): మండలంలోని సిద్దాపూర్‌లో గతవారం రోజులుగా నిర్వహించిన ఫ్రెండ్స్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు ఆదివారం ముగిశాయి. చీలపల్లి గ్రామ కాంగ్రెస్ నాయకుడు హఫీజ్ ఆధ్వర్యంలో టోర్నమెంట్‌ను నిర్వహించారు. ఫైనల్‌లో వికారాబాద్ జిల్లాలోని గుర్రం తండా, సిద్దాపూర్ ఫ్రెండ్స్ సీసీ జట్టు మధ్య పోటీ హోరాహోరీగా సాగింది. చివరకు సిద్దాపూర్ జట్టు విజయం సాధించింది. విజేతకు కప్, రూ.50 వేల నగదు, రన్నర్‌కు కప్, రూ. 25వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సంగారెడ్డి, భద్రారెడ్డి, రామ్‌రెడ్డి, దత్తారెడ్డి, మెయిజ్ పాల్గొన్నారు.



జహీరాబాద్: క్యాంపు కార్యాలయంపై జెండా ఎగురవేసిన ఎమ్మెల్యే మాణిక్‌రావు తదితరులు



జిన్నారం : జాతీయ జెండాకు గౌరవ వందనం చేస్తున్న అధికారులు, విద్యార్థులు



పటాన్‌చెరు: చైతన్య హైస్కూల్‌కు నగదు పురస్కారం బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

మువ్వన్నెల రెపరెపలు

76వ గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని ఆదివారం సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా జాతీయ జెండాను ఎగరవేసి గౌరవ వందన స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను స్మరించుకొని నివాళులర్పించారు. అనంతరం ఆయా పాఠశాలల్లో విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, మార్చ్‌ఫాస్ట్ అందరిని అట్టుకున్నాయి. అలాగే, విజేతులకు బహుమతులు, నగదు పురస్కారం అందజేశారు.



సంగారెడ్డి : ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో..



నారాయణఖేడ్: మున్సిపల్ కార్యాలయం వద్ద..



బీజేపీ జిల్లా కార్యాలయంలో..



సంగారెడ్డి టౌన్: జెండాను ఆవిష్కరించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవానీచంద్ర



కంది: జెండాను ఎగురవేస్తున్న తహసీల్దార్



ఝరాసంగం: జెండా ఎగరవేస్తున్న ట్రైనీ కలెక్టర్, తదితరులు

పార్టీ కోసం కష్టపడే వారికే గుర్తింపు

మాజీమంత్రి హరీశ్‌రావు



శ్రీకాంత్‌గౌడ్‌కు శుభాకాంక్షలు తెలిపిన హరీశ్‌రావు, తదితరులు

పటాన్‌చెరు టౌన్: బీఆర్ఎస్ పార్టీ కోసం కష్టపడే వారికి గుర్తింపు ఉంటుందని మాజీమంత్రి హరీశ్‌రావు అన్నారు. ఆదివారం పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌లో బీఆర్ఎస్ నేత, మాజీ జెడ్పీటీసీ శ్రీకాంత్‌గౌడ్ జన్మదిన వేడుకల్లో హరీశ్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు చంటి క్రాంతి కిరణ్, కూన శ్రీశైలం గౌడ్‌లు పాల్గొని శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు చెప్పారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌గౌడ్ మాట్లాడుతూ.. తనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన వారిందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

అంకితభావంతో చదవాలి

మునిపల్లి(అందోల్): ప్రతి విద్యార్థి అంకితభావంతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని మాజీ ఎంపీపీ రాంరెడ్డి విద్యార్థులకు సూచించారు. ఆదివారం తాటిపల్లి కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలోఆటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే సంవత్సరం కేజీబీవీలో ఇంటర్మీడియట్ ఏర్పాటవుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ పెంటయ్య, ఏఎంసీ డైరెక్టర్ మైపాల్ ప్రిన్సిపాల్ కవిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గురుకులాల ప్రవేశాలపై విస్తృత ప్రచారం



ర్యాలీ నిర్వహించిన ఉపాధ్యాయులు

హత్నూర(సంగారెడ్డి): గురుకులాల్లో విద్యార్థుల చేరికపై హత్నూరలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల, పాఠశాల అధ్యాపక బృందం ఆదివారం గ్రామాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మధుసూదన్ మాట్లాడుతూ.. గురుకులాల్లో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన వసతులు కల్పిస్తుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ ప్రభుత్వ గురుకులాల్లో ప్రవేశం పొంది వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. ఐదు నుంచి 9వ తరగతిలో చేరికకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. అర్హత గల విద్యార్థులు ఫిబ్రవరి 1 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని దరఖాస్తు చేసుకున్న వారికి ఫిబ్రవరి 23న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. కార్యక్రమంలో పీడీ గణపతితో పాటు ఉపాధ్యాయ బృందం, తదితరులు పాల్గొన్నారు.

రూ.2 కోట్లతో ఎన్టీఆర్ స్టేడియం అభివృద్ధి

మంత్రి దామోదర రాజనర్సింహా



విజేతలకు బహుమతులను అందజేస్తున్న మంత్రి

జోగిపేట(అందోల్): ఎన్టీఆర్ స్టేడియాన్ని రూ.2 కోట్ల నిధులుతో అభివృద్ధి చేస్తున్నట్లు మంత్రి దామోదర అన్నారు. ఆదివారం దివంగత మాజీ మంత్రి రాజనర్సింహ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమంలో హాజరై ప్రసంగించారు. పోటీల్లో గెలుపోటములు సహజమని, ఓడిన జట్టు నిరాశచెందొద్దని సూచించారు. రాబోయే రోజుల్లో క్రికెట్ పోటీలు నిర్వహించేలా మైదానాన్ని తీర్చిదిద్దుతామన్నారు. మైదానానికి చుట్టూ ప్రహరీ గోడ, ఒకవైపు నుంచి లోనికి వేళ్లేందుకు ప్రధాన గేటు, చుట్టూ ఫ్లడ్ లైట్లను ఏర్పాటు చేయిస్తున్నట్లు తెలిపారు. తన తండ్రి రాజనర్సింహ పేరుతో టోర్నమెంట్ నిర్వహించిన చిట్టిబాబును ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం విజేతలకు మంత్రి దామోదర రాజనర్సింహ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ పాండు, డిప్యూటీ తహసీల్దార్ మధుకర్‌రెడ్డి, కౌన్సిలర్ శంకర్, కోఆప్షన్ సభ్యుడు అల్లె శ్రీకాంత్, సీఐ అనిల్ కుమార్, ఎస్ఐలు పాండు, క్రాంతి, నిర్వాహకులు హర్షద్, జీషాన్ పాల్గొన్నారు.

జోగిపేట ఏరియా ఆస్పత్రి తనిఖీ

జోగిపేట(అందోల్): జోగిపేట ఏరియా ఆస్పత్రిని మంత్రి దామోదర ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రి పరిసరాలను స్వయంగా పరిశీలించారు. ఆస్పత్రిలో ఇన్‌పేషెంట్‌లు, అవుట్ పేషెంట్‌లు ఎంత మంది వస్తున్నారని డ్యూటీ డాక్టర్ సిద్ధార్థ్‌ను అడిగి తెలుసుకున్నారు. మందుల కొరత ఏమైనా ఉందా? అని ప్రశ్నించారు. ఆస్పత్రికి వచ్చిన పేషెంట్‌లు సంగారెడ్డికి వెళ్లకూడదని, ఇక్కడ సిబ్బంది అందుబాటులో ఉండి వైద్య సేవలందించాలని ఆదేశించారు. ఏడాదిలో అందోల్ కొత్త ఆస్పత్రి పూర్తవుతుందని అన్ని వసతులను కల్పించేందుకు నిధులను కూడా మంజూరు చేయించినట్లు తెలిపారు. ఆర్డీఓ పాండు, డిప్యూటీ తహసీల్దార్ మధుకర్‌రెడ్డి, కౌన్సిలర్ శంకర్, కోఆప్షన్ శ్రీకాంత్ ఉన్నారు.

ఇంటింటా సంక్షేమ సంబురం

ఎంపీ సురేష్ షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి



నారాయణఖేడ్: జూకల్‌లో పథకాల మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

నారాయణఖేడ్: అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందజేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని జూకల్‌లో ఆదివారం రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలను ప్రారంభించారు. లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. అర్హులకే పథకాలను అందజేయాలనే ఉద్దేశంతో గ్రామ సభల్లో దరఖాస్తులను స్వీకరించి, ఎంపిక చేశామని తెలిపారు.

జిన్నారం మండలంలో..

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలం మాదారం గ్రామంలో అర్హులైన లబ్ధిదారులకు ఎంపీడీఓ అరుణరెడ్డి, తహసీల్దార్ భిక్షపతి సంక్షేమ పథకాల ప్రొసీడింగ్స్ కాపీలను అందజేశారు. కొత్త రేషన్ కార్డులు 109, ఇందిర ఇండ్లు 216, రైతు భరోసా 1413 లబ్ధిదారులకు అధికారులు అందజేశారు. గుమ్మడిదల మండలం వీరన్నగూడెం గ్రామంలో కొత్త రేషన్ కార్డులు 54, రైతు భరోసా 87, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా 20, ఇందిరమ్మ ఇల్లు 109 అర్హులైన లబ్ధిదారులకు ఎంపీడీఓ ఉమాదేవి, తహసిల్దార్ గంగాభవాని జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ప్రొసీడింగ్‌లను అందజేశారు.

మంజూరు పత్రాల పంపిణీ

న్యాల్‌కల్(జహీరాబాద్): న్యాల్‌కల్‌లో ప్రభుత్వ పథకాల మంజూరు పత్రాలను ఆదివారం పంపిణీ చేశారు. కార్యక్రమానికి మండల ప్రత్యేక అధికారి రవీందర్‌రెడ్డి, జహీరాబాద్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తిరుపతిరెడ్డి, తహసీల్దార్ భూపాల్, ఎంపీడీఓ రాజశేఖర్, డీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు. కార్యక్రమంలో రైతు భరోసా కింద 1050 మంది, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద 24 మంది, ఇందిరమ్మ ఇండ్లు పథకం కింద 150 మంది, రేషన్ కార్డుల కోసం 92 లబ్ధిదారులను గుర్తించారు. వారికి మంజూరు పత్రాలను పంపిణీ చేశారు.

పథకాలను సద్వినియోగం చేసుకోండి

సంగారెడ్డి టౌన్ : అర్హులైన లబ్ధిదారులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సంగారెడ్డి మండల ఎంపీడీఓ యాదగిరి అన్నారు. ఆదివారం సంగారెడ్డి మండలంలోని ఇరిగిపల్లిలోని గ్రామ సభలో నాలుగు సంక్షేమ పథకాల లబ్ధిదారులకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలోవ్యవసాయ శాఖ అధికారులు, పంచాయతీ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

రాయికోడ్(అందోల్): అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు మంజూరవుతాయని జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మెన్ నాగారం గొల్ల అంజయ్య అన్నారు. మండలంలోని నాగ్వార్ గ్రామంలో ప్రజాపాలన సమావేశం నాలుగు సంక్షేమ పథకాల లబ్ధిదారులకు మండల ఎస్ఓ జగదీష్‌తో కలిసి మంజూరు పత్రాలను అందజేశారు. 445 మంది రైతు భరోసా, 16 మందికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, 50 మందికి ఇందిరమ్మ ఇండ్లు, 18 మందికి రేషన్ కార్డులు మంజూరు పత్రాలు పంపిణీ చేశారు.

బీఆర్ఎస్ పాలనలో దోపిడీ

కల్హేర్(నారాయణఖేడ్): బీఆర్ఎస్ ప్రభుత్వ 10 ఏళ్ల పాలనలో కాళేశ్వరం, తదితర పనుల పేరిట కమీషన్లు దోచుకున్నారని ఎమ్మెల్యే సంజీవరెడ్డి ఆరోపించారు. ఆదివారం కల్హేర్ మండలం రాపర్తిలో ప్రభుత్వ సంక్షేమ పథకలు ప్రారంభించారు. లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజాధనం దోచుకుని ఖజాన ఖాలీ చేశారని మండిపడ్డారు. అధికారంలో వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం చేతిలో అప్పులతో చిప్ప అప్పజెప్పారని మండిపడ్డారు.

సంక్షేమ పథకాలతో లబ్ధి

ఝరాసంగం(జహీరాబాద్): ప్రజలు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ట్రైనీ కలెక్టర్ మనోజ్ అన్నారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల పథకాలకు ఎంపికైన వారికి ప్రొసీడింగ్‌లను అందజేశారు. వారు మాట్లాడుతూ.. జాబితాలో పేరు రాని వారు తిరిగి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సౌభాగ్యమే లక్ష్యంగా..



మంజూరు పత్రాన్ని అందజేస్తున్న మంత్రి

వట్‌పల్లి(అందోల్): పేదల ఇంట సౌభాగ్యం నింపడమే లక్ష్యంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ఆదివారం అందోల్ మండలంలోని నేరడిగుంటలో ఇందిరమ్మ ఇళ్లు, రైతుభరోసా, రేషన్ కార్డుల పంపిణీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపట్టే సంక్షేమ పథకాల ఫలాలు చిట్టచివరి ప్రజలకు చేరేవరకు పథకాలు నిరంతరంగా కొనసాగుతాయన్నారు. అనంతరం లబ్ధిదారులకు పథకాల మంజూరు పత్రాలను మంత్రి అందజేశారు. నేరడిగుంట గ్రామంలో పీహెచ్‌సీ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు.

సంక్షిప్త వార్తలు

◆ **టెన్త్ టాపర్‌కు నగదు బహుమతి**

రాయికోడ్(అందోల్): రాయికోడ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2023–24 విద్యాసంవత్సరంలో పదో తరగతి ఫలితాల్లో శంషోద్దిన్‌పూర్ గ్రామానికి చెందిన మధుకర్ టాపర్‌గా నిలిచాడు. పాఠశాల 2001–2002 పదవ తరగతి పూర్వ విద్యార్థులు ఎంఈఓ అంజయ్యతో కలిసి మధుకర్‌ను సన్మానించి రూ.10 వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో మొగులప్ప, సాయిరాం షేట్కార్, హన్మంత్‌రావు, గోపాల్, అంజన్న, జనార్దన్, శివప్రసాద్, హన్మాగౌడ్, ఎంఈఓ అంజయ్య, ఉపాధ్యాయులు, తదితరులు ఉన్నారు.

◆ **మద్యం సేవించి వాహనం నడిపితే చర్యలు**

కల్హేర్(నారాయణఖేడ్): మద్యం సేవించి వాహనం నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని కల్హేర్ ఎస్ఐ వెంకటేశం హెచ్చరించారు. ఆదివారం నిజాంపేట్ మండలం బాచేపల్లి వద్ద వాహనాలు తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. తప్పనిసరిగా లైసెన్స్ ఉండాలన్నారు. హెల్మెట్ ధరించాలని, ఇన్సూరెన్స్, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ వెంట తెచ్చుకోవాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే జైలుకు పంపుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ట్రైనీ ఎస్ఐ శ్రీశైలం పాల్గొన్నారు.

◆ **రోడ్డు బాగుచేయాలంటూ ర్యాలీ**

పటాన్ చెరు: అమీన్‌పూర్ నుంచి లింగంపల్లి వరకు ఉన్న ప్రధాన రహదారిని బాగు చేయాలంటూ పట్టణ పరిధిలోని కాలనీవాసులు ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ఆదివారం కాలనీ సంఘాల ఆధ్వర్యంలో వివిధ కాలనీలకు చెందిన రోడ్డు బాగు చేయాలంటూ అమీనపూర్ గాంధీ బొమ్మ నుంచి లింగంపల్లి థియేటర్ వరకు ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ.. రోడ్డు అధ్వానంగా ఉందని.. ఎవరూ పట్టించుకోలేదని వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

◆ **108లో ప్రసవం.. తల్లీబిడ్డ క్షేమం**

హత్నూర(సంగారెడ్డి): హత్నూర మండలం కాసాల గ్రామానికి చెందిన గర్భిణీ లక్ష్మీప్రసన్నకు పురిటినొప్పులు రావడంతో 108 వాహనంలో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో అంబులెన్స్‌లోనే ప్రసవించింది. తల్లి బిడ్డను సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లినట్లు ఈఎంటీ ప్రవీణ్, పైలెట్ బాలరాజ్ తెలిపారు. ప్రజలు 108ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

◆ **పాతపంటల జాతర**

జహీరాబాద్: మొగుడంపల్లి మండలంలోని ఉప్పర్ పల్లి తండాలో పాతపంటల జాతర ఉత్సవాలను తండావాసులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం తండాకు ఎండ్ల బండ్లు చేరుకోగానే ప్రజలు నృత్యం చేస్తూ సంబరాలు చేసుకున్నారు. అనంతరం మహిళా రైతులు తాము చిరుధాన్యాలనే సాగుచేసుకుంటున్నామని, ఏడాదికి సరిపడా వాటినే నిల్వపెట్టుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త రమేష్, డీడీఎస్ ప్రతినిధి బాలన్న పాల్గొన్నారు.

◆ **అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు**

పటాన్‌చెరు: శరవేగంగా అభివృద్ధి చెందుతున్న అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలో శాశ్వత ప్రతిపాదికన ప్రభుత్వ భవనాలు నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి తెలిపారు. ఆదివారం సాయంత్రం అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని నవ్యారోడ్డులో కోటి 43 లక్షల రూపాయల అంచనా వ్యయంతో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్, కోటి రూపాయల అంచనా వ్యయంతో మున్సిపల్ కార్యాలయం, రూ.50 లక్షల అంచనా వ్యయంతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనాల నిర్మాణ పనులకు స్థానిక మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి లక్ష్యంగా పనిచేసిన పాలకవర్గానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

◆ **చర్చి అభివృద్ధికి విరాళం**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): అన్ని మతాల సారాంశం ఒకటేనని, ప్రతి ఒక్కరిలో ఆధ్యాత్మిక చింతనను పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం రామచంద్రాపురం పట్టణంలోని సెయింట్ ఆర్నాల్డ్ పాఠశాల ఆవరణలో నూతనంగా నిర్మించిన చర్చిను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చర్చి అభివృద్ధికి రూ.10లక్షలు సొంత డబ్బులను విరాళంగా అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా నిరుపేదలకు అండగా నిలబడంలో క్రైస్తవ మిషనరీలు ఎంతో కృషి చేస్తున్నాయని తెలిపారు. నియోజకవర్గంలో ఆలయాలు, మసీదులు, చర్చిల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పుష్ప, మాజీ కార్పొరేటర్ అంజయ్య పాల్గొన్నారు.

◆ **ఘనంగా సంగోళ్లరాయన్న వర్ధంతి**

నారాయణఖేడ్: మండలంలోని రుద్రారంలో ఆదివారం బీరప్ప కురుమ సంఘం ఆధ్వర్యంలో క్రాంతివీర సంగోళ్లరాయన్న 194వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. దేశస్వాతంత్ర్యం కోసం పోరాటంలో ముఖ్యపాత్ర పోషించిన వారిలో రాయన్న ఒకరని కొనియాడారు. కార్యక్రమంలో బీరప్ప కురుమ సంఘం చైర్మన్, మండల బీజేపీ అధ్యక్షులు దశరథ కురుమ, మాజీ చైర్మన్ భూంగొండ, మాజీ సర్పంచ్ ప్రభాకర్, గ్రామపెద్దలు జనార్దన్, శ్రీకాంత్‌రెడ్డి, విలాస్‌రావు, సాయిలు, మారుతి పాల్గొన్నారు.

క్రీడలకు కేంద్రంగా మైత్రి గ్రౌండ్

ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి



నగదు పురస్కారం, టోపీని అందజేస్తున్న ఎమ్మెల్యే

పటాన్‌చెరు టౌన్: క్రీడలకు కేంద్రంగా మైత్రి గ్రౌండ్‌ను తీర్చిదిద్దామని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని మైత్రి మైదానంలో మైత్రి క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో గతవారం రోజులుగా నిర్వహిస్తున్న 35వ మైత్రి క్రికెట్ ఇన్విటేషన్ ట్రోఫీ ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..యువ క్రికెటర్లను తయారు చేయడంలో మైత్రి క్రికెట్ క్లబ్ సేవలను కొనియాడారు. ఫైనల్స్‌లో ఎస్సార్–ఏ జట్టుపై మురాజ్ సీసీ జట్టు విజయం సాధించింది. విజేత జట్టుకు నగదు పురస్కారం, ట్రోఫీలను అందజేశారు.

క్యాంపు కార్యాలయం దాడిపై ఆరా



పీసీసీ కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్, నాయకులు

పటాన్‌చెరు: ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి క్యాంపు కార్యాలయంపై జరిగిన దాడి వివరాలు తెలుసుకునేందుకు పీసీసీ ఏర్పాటు చేసిన కమిటీ ప్రతినిధులు ఆదివారం సమావేశమయ్యారు. కాంగ్రెస్ కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలను పీసీసీ కమిటీ సభ్యులతో పంచుకున్నారు. అధికారిక కార్యక్రమాల్లో ఏమాత్రం సంబంధం లేకుండా ఎమ్మెల్యే వారి అనుచరులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, అధికారులు కూడా అలాగే ఉన్నారని స్థానిక నాయకులు పీసీసీ కమిటీ సభ్యుల ఎదుట వాపోయారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం దాడిపై పోలీసులు పెట్టిన కేసులపై కూడా ఈ సమావేశంలో చర్చించినట్లు తెలిసింది. అయితే పీసీసీ కాంగ్రెస్ కమిటీ సభ్యులు కార్యకర్తలకు భరోసా కల్పిస్తూ తము అండగా ఉంటామని చెప్పినట్లు తెలిసింది. తాను కూడా నాలుగు సార్లు ఓడిపోయి గెలిచినట్లు కమిటీ సభ్యులు వేములవాడ శాసనసభ్యుడు ఆది శ్రీనివాస్ కార్యకర్తలకు వివరించారు. ఈ ప్రాంతంలో కాంగ్రెస్ కార్యకర్తలు 11 సమస్యలపై రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ పెద్దలకు నివేదిస్తానని ఆది శ్రీనివాస్, వినోద్ రెడ్డిలు స్పష్టం చేశారు.